# భార్య అంటే?

శ్రీమతి వసుపులేటి శాంతకుమారి

భార్య అంటే బానిస కాదోయ్, భావి జీవిత భాగ్య సంపదల,
మాతృ దేశపు మహోదయమునకు, మార్గ మిడెడి మగువ ఓయ్.

సన్నటి వెలుగుతో, గలగల ధ్వనితో అంధకారంలో అజ్ఞానంలో మునిగిన ప్రపంచాన్ని మేలుకొలుపుతూ, ఆకాశాన్ని అలముకున్న కారు మబ్బులను చీల్చుకుంటూ సాగిపోతుంది మా బండి. తమ ముదము కోసం, ప్రపంచానికి ముప్పు తెస్తున్నామన్న సంగతి మరచి మేఘాలు గుద్దుకోవడంతోటి ఉరుములు ప్రారంభమయ్యాయి.

"స్త్రీ యన రక్తమాంసముల చక్కని గ్రథనము కాదు, స్వర్గము చవిచూపి, మోక్షమునకు ద్వారమగు గృహమున కధికారి" అన్న శారద ఉద్రేకపు వాక్యాలను స్మృతికి తెచ్చుకుంటూ ఇల్లు చేరాను. వెంకన్నగాడి గుడిసెలో గుసగుసలు ఆగిపోయి, చిన్నటి ఆ కిటికీగుండా పరికిస్తూ నిలబడ్డాను. అంధకారాన్ని ప్రాలద్రోలి, జ్ఞానోదయానికి మార్గం చూపుతున్నట్లు ఆ చిన్నటి దీపపు వెలుగు ఆ గృహాన్ని అలంకరించింది. మంచంమీద వెంకడు ఉద్రేకంతో కేకలు వేస్తున్నాడు. జిలుగు చీకటిలో వెంకి వణకుతూ నిలబడింది.

"ఈ యారదాకా... ఏడబోయావు" "నంజా" చంపేత్తానంటూ పైకిలేచాడు. లచ్చి కదలలేక పోయింది.

'నీవు నా పెండ్లానివి... నేను .. నీకు ముడేసింది, నేను చెప్పినట్లు నీవు వినాలి. నా నోరు మూత్తావు గాని... లోకం' అంటూ మొదలు పెట్టాడు. ఆ మాటలు ఇంకా వినాలనే కుతూహలం కొలది వర్షాన్ని లెక్కచేయకుండా నిలబడ్డాను.

"లచ్చీ నీవు నా గుడ్డలుతికే చాకలివి తెల్సిందీ... నేను కూడుతింటా... కోడి కెలికినట్లు కెలికి పెట్టా; ఆ కంచంలోనే నీవూ తినాలి. నోరెత్తావా చంపేత్తా... అదే అమృతం నీకు. నేను కల్లు తాగొత్తా నోరెత్త కూడదు. నేను సంసారాన్ని నడిపేవాడిని. నీవు ఆ బండిని లాగేదున్నవు..." నీకు పేరువుంది నేను పిలవను "ఓసేయ్"...దున్నపోతా, ఎద్దా, గాడిదా అంటూ పిలుస్తా, నీవు...ఊ...ఊ అంటూ రావాలి. లచ్చి కొంచెం ముందుకొచ్చి నిలబడ్డది ధైర్యంతో.

"నిజం చెప్పు మరి... నేను నీకు మూడెట్టిందెందుకనుకున్నావ్. భార్య అంటే ఇంతే... సూక్ష్మం తెల్సుకోసా... నేను లేకపోతే మన బుల్లోడు ఎట్టొత్తాడు, మా అయ్య లేకపోతే నేనెట్టొత్తాను"?

"నేను ఒప్పుకోను" అంది లచ్చి ధైర్యం చేసి. వెంకన్న తలూపాడు... ఇద్గో లచ్చీ నేను చెప్పేతంతా సత్తెం, సత్తెప్రమాణకంగా చెపుతుండా... మా అయ్య చెప్పిండుగదా భార్య అంటే బానిసని, బండి లాగే ఎద్దని, మొగోడికి చాకరిచేసే పనిమనిషని... అంతేగాదు "పిల్లా".. ఇదంతా మన శాస్త్రాల్లో పెద్దోళ్ళు రాసిపెట్టిండ్రు అంటూ కూలబడ్డాడు నిషా తగ్గడంతోటి."

"అయితే ఓయ్యో ఈ ఆడోళ్ళు ఏంపాపంచేసారు అంత చులకనపడానికి" అంది లచ్చి,

"ఇద్గో నేను చెప్పేదంతా మర్చి పోనావు... నాకు చేతులులేవనుకున్నావ్? నేను వండుకోలేనూ? పనిచేసుకోలేనూ? పపంచం ఏమంటుంది? ఈ ముండా పపంచం కోసం లచ్చీ... నా మాటలు సత్తెం... నమ్ము" అంటూ యథాప్రకారం సరసాల్లోదిగాడు.

## భార్య అంటే ?

గృహలక్ష్మి

ఆ నాటి కాలేజి సంఘటనకు ఇది దోహదమివ్వడంతోటి మరింత చింతించాను. అజ్ఞానంలో స్త్రీ అంటే అంత నీచబుద్ధి ప్రబలిపోయిందనుకున్నా ... కాస్తో కూస్తో విజ్ఞానులమనే నవనాగరికుల ధోరణి కూడా ఇలాగేవుంది. మొన్న శారదను "నీవు నా హృదయ పీఠమున తొణికిసలాడెడు దివ్యజ్యోతివి. ప్రేమామృతమును దానంచేసే దాతవు. నీవు లేకపోతే నేను జీవించలేననిపిస్తుంది. నా సర్వస్వము నీ కర్పిస్తా. నిన్ను పూలతో పూజిస్తా" అంటూ యుత్తరం వ్రాసాడు ఓ చదువుకున్న మహానుభావుడు. శారద సంతోషంకొలది నాకు చూపిందేగాని అది చూచినతర్వాత వివేకులుకూడా స్త్రీ యొక్క సహజ ధర్మమును గుర్తించలేక పోతున్నారని విచారించాను. అజ్ఞానంతో వెంకన్న బానిస అన్నాడు, వివేకంతో ఆయన దైవమన్నాడు. హృదయమని నెత్తి నెక్కించుకున్నాడు. కాని స్త్రీకి సృష్టియందుగల ప్రకృతి సహజస్థానం, బాధ్యతలు ఎవరు గుర్తించలేకపోవడం శోచనీయం.

ఇదంతా ఇటుంచి, తన జీవితం చాలవరకుగడపి స్వానుభవం సంపాదించిన శాస్త్రిగారు నేను వెళ్ళే సరికి "ఏమేవ్ చెవిటిముఖమా" అంటూ కేకవేసాడు భార్యను. ముఖప్రీతికోసం నవ్వలేకనవ్వాను. అంతటితో ఆపితేబాగుణ్ణు "అది ఓ ఎద్దు" ఈ కాలం మాలచదువులకు ఆస్కారమిచ్చి శాస్త్రాలను మంట కలుపుతున్నారు. 'భార్యకు పతియేదైవ'మన్న రోజులు మాయమయ్యాయి" అంటూ ప్రసంగం మొదలు పెట్టేసరికి ఆగలేక "అమ్మపిలుస్తుందని" సాకు చెప్పి తప్పించుకున్నాను. శాస్త్రిగారిని మరచినా, నిన్నటి రంగారావు ధోరణి గుర్తుకొచ్చినప్పుడు నవ్వలేక నవ్వాను. ఆయన ముద్దుగా "డార్లింగ్" "షీషీ" అంటూ సంబోధించాడు సతీమణి సుశీలమ్మను.

"నేను నీమనో రాజ్యానికి ప్రభువును, సంఘము నియమించిన నిరంకుశ పరిపాలకుడను. సంసార రథమునకు రథికుడను, గృహమునకధికారిని. మరినీవో... నా సేవకురాలవు, హక్కులులేని బానిసవు, సంసార రథమును లాగెడుగుర్రము. నా కామాన్నితీర్చే యంత్రానివి... నా వంశ వృద్ధికి సృష్టించబడ్డ విగ్రహము" అంటూ శాసించే ఓమిత్రుడు "యథాస్థానం" అంటే ఏమిటండోయ్ అన్నాడు.

"మీరు పొరబడుతున్నారు. మీరు ప్రభువులైతే ఆమె మంత్రి అని, మీరు రథికులైతే, ఆమె సారథని, గృహాన్ని పావనంచేసి, లక్ష్మికి ఘనస్వాగతములిచ్చే గృహలక్ష్మి యని గుర్తించాలి. అదే యథాస్థానం అవుతుంది" అన్నా.

ఆయన అపజయాన్ని సహించలేక, వినోదంకోసం, విజ్ఞానాన్ని వృథాపరచే ఓ సోదరవిద్యార్థి "సంఘంలో పురుషుడు సాధించగల్గిన కార్యాలు స్త్రీలు సాధించలేరు" అన్నాడు చిలిపిగా.

పురుషుని, మానము, గౌరవమును నిలబెట్టి, సాంఘిక సేవకు సంసిద్ధుని చేయు ఉత్తమురాలు స్త్రీ. ఆ నాడు గౌరవరక్షణార్థము అగ్నిగుండమున దుముకకలిగిన "పద్మిని" భారతస్త్రీ; అవినీతి, అత్యాచారములు, మూర్కొనినను, అసిధారా దీక్షను వీడని "శకుంతల" భారతస్త్రీ; అకసము విరిగి తలపై బడినను తన యుద్దేశమునుండి పదస్థలన మెఱుగని "సావిత్రి" భారతస్త్రీ అని స్మృతికి తెచ్చిన తరువాత మిత్రుడు తన అంగీకారాన్ని వెలిబుచ్చాడు.

స్త్రీని అధమురాలుగాను, దైవంగాను చేయడంకంటే, పురుషుడు, స్త్రీ సర్వకార్యములు సక్రమముగా నెరవేర్చి, దేశ భావిభాగ్య సంపదలకు, పురోభివృద్ధికి, సంఘనిర్మాణానికి పురుషునకు తోడ్పడగల మహా శక్తిఅని గుర్తించుట యుత్తమం.

ఇదంతా విన్న భాగ్యలక్ష్మి "వివేకంతో స్త్రీకి సంఘమందుగల సహజస్థానాన్ని అందజేయ గలిగిననాడే పురుషుడు ఎట్టి కార్యనిర్వహణమునకును వెనుదీయనవసరంలేదు" అంటూ నొక్కి చెప్పింది ఉత్సాహంకొలది బల్ల బ్రద్దలుచేస్తూ.